ప్రజాశక్తి

మంగళవారం 20 ఫిబ్రవరి 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఉద్యోగులపై కొరడా

- కార్పొరేషన్‌లో ఏఈ సహా ఆరుగురు సస్పెన్షన్
- ఉద్యోగం నుంచి వాల్ ఆపరేటర్ తొలగింపు
- నీరు కలుషితానికి నిర్లక్ష్యమే కారణం నిర్ధారణ
- ఇంజినీరింగ్ విభాగం ప్రక్షాళనపై దృష్టి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ ప్రక్షాళనకు ఉన్నతాధికారులు ఉపక్రమించారు. గుంటూరులో డయేరియా ప్రభలడానికి కారణాలపై నగరపాలక సంస్థ అధికారులు నిర్వహించిన అధ్యయనంలో ఇంజినీరింగ్ విభాగం పనితీరు లోపభూయిష్టంగా ఉన్నట్టు గుర్తించారు. క్షేత్రస్థాయిలో కీలకభూమిక పోషించాల్సిన ఏఈలు పనితీరుసరిగా లేదనే విమర్శల నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

ప్రధానంగా తాగునీటి సరఫరాపై మొత్తం పనిని క్షేత్రస్థాయిలో ఫిట్టర్, వాల్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగించి ఏఈ, డిఈ ఇతర అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం వల్లే తరచూ లీకేజీలు ఏర్పడి నీటి కాలుష్యమైనట్లు ప్రాథమిక విచారణలో వెల్లడయింది. ఈ మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. నీరు కలుషితం అయిన శారదాకాలనీకి ఇతర ప్రాంతాలకు చెందిన అధికారులను తనిఖీ నిమిత్తం పంపగా శాఖపరంగా పలు లోపాలు గుర్తించి నివేదిక సమర్పించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు శాఖపరమైన లోపాలను వారు పరిశీలించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యవైఖరిని అవలంభించిన అసిస్టెంట్ ఇంజినీరు ఎం.అనూష, ఎమినిటి కార్యదర్శులు వి.నాగరామ కోటయ్య, ఎం.శృతి కీర్తనలను

▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు

పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణపై విద్యా శాఖాధికారులతో కలిసి చీఫ్ సూపరింటెండెంట్లు, డెపార్ట్మెంటల్ ఆఫీసర్లతో సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షించారు. వచ్చేనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే పరీక్షలకు జిల్లాలో 420 ప్రభుత్వ, ప్రైయివేటు స్కూల్స్ నుండి 31,291 మంది విద్యార్థులు 147 పరీక్షా కేంద్రాలల్లో పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్షా కేంద్రాలకు నిర్దేశించిన సమయానికి సంబంధిత మెటీరియల్‌ను పోలీసు భద్రత మధ్య తీసుకువెళ్లాలన్నారు. పరీక్ష అనంతరం జవాబు పత్రాలు పరీక్షా కేంద్రం నుండి పోస్ట్ ఆఫీసుకు తరలించే వరకు చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, ఇందుకు డిపార్ట్మెంటల్ అధికారులు సహాయం అందించాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో, సమీప ప్రాంతాల్లోనూ జిరాక్స్ మిషన్లు, జిరాక్స్ షాపులు పరీక్షల సమయం ముగిసే వరకు మూసివేయించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని పోలీస్ శాఖాధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, వేసవి దృష్ట్యా తాగునీరు అందుబాటులో వుంచాలని, పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్య నిర్వహణ, పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్, ఒఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్య శిబిరాల ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సమస్యలు, సందేహాలు పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అధికారులందరు కచ్చితంగా పాటించి, బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ పెద్దిరోజా, ఆర్జేడి లింగేశ్వరరెడ్డి, డిఈఒ పి.శైలజ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అప్పుల బాధతో యువ కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడని ఘటన మండల కేంద్రమైన ప్రత్తిపాడులో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన యర్రబోతుల రత్నరెడ్డి (27) స్థానిక పైనీ అగ్రోస్ పురుగు మందుల దుకాణంలో గుమాస్తాగా పని చేయడంతోపాటు సొంతపొలం మూడెకరాల్లో మిర్చి, మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. పంటల సాగు కోసం పెట్టుబడు అప్పులు చేశాడు. దిగుబడులు సరిగా రాకపోవడంతో నష్టాలు వచ్చాయి. ఇప్పటికే కొంత పొలం అప్పుల కింద తనఖాలో ఉండడం, కొత్తగా అప్పులు పెరగడంతో వాటిని తీర్చే మార్గం తోచక రత్నరెడ్డి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పొలం వద్దకెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ప్రత్తిపాడులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషయమంగా మారడంతో సోమవారం గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. అయితే అప్పటికే రత్నరెడ్డి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేశారు.

మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

గ్రూప్-2లో నూతన సిలబస్

- అభ్యర్థులకు ఉచితంగా 'భారత సమాజం' మెటీరియల్
- పంపిణీ చేసిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- జూన్ లేదా జులైలో మెయిన్ పరీక్షలకు అవకాశం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గ్రూప్-2 పరీక్షల్లో నూతన సిలబస్‌గా 'భారత సమాజం'ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) చేర్చిందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. అభ్యర్థులకు ఉపయోగపడేలా ఈ అంశంపై మెటీరియల్‌ను రూపొందించామని, ఉచితంగానూ ఇస్తున్నామని చెప్పారు. గ్రూప్-2పై స్థానిక పండరిపురంలోని ఏలూరు సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అవగాహన కల్పించారు. తొలుత మెటీరియల్‌ను ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ 897 పోస్టులతో గ్రూప్-2 నోటిఫికేషన్ గత డిసెంబర్‌లో జారీ అయ్యిందని, ప్రిలిమినరీ పరీక్ష తర్వాత ప్రధాన పరీక్ష ఉంటుందని చెప్పారు. ఈ నెల 25న నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షలో 150 మార్కులకు 150 ప్రశ్నలుంటాయని చెప్పారు. ఇందులో భారతదేశ చరిత్రపై 30 ప్రశ్నలు, జాగ్రఫీపై 30 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్, మెంటల్ ఎబిలిటీపై 30 ప్రశ్నలు ఉంటాయని వివరించారు. నూతనంగా చేర్చిన భారత సమాజం అంశంపైనా 30 ప్రశ్నలు

▶ 2లో

హత్య కేసులో భార్య, ప్రియుడుకి జీవిత ఖైదు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

హత్యకేసులో మృతుని భార్య, ఆమె ప్రియుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ మూడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.అర్చన సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కృష్ణాయపాలేనికి చెందిన బుల్లా రవికి తుళ్లూరు మండలం ఉద్దండరాయనిపాలేనికి చెందిన రాణితో హత్య ఘనటనకు 13 ఏళ్లకు ముందు వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. రవి పుట్టకతోనే మూగ, చెవుడు వైకల్యం కలిగి ఉన్నాడు. పెళ్లి తర్వాత పెనుమాకకు చెందిన దూరు కిరణ్‌తో రాణికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో భార్యాభర్తలిద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. రాణి నూతక్కిలో ఉన్న ఆమె అత్త ఇంటికి వెళ్లిపోయింది. బుల్లా రవి తండ్రి శామ్యూలు 40 సెంట్లు స్థలాన్ని కౌలుకు తీసుకొని తండ్రి, కొడుకులు ఇరువు బెండకాయ తోట వేశారు. ఈ క్రమంలో బుల్లా రవి తల్లి చనిపోవటంతో పెద్దలు మాట్లాడి భార్య రాణిని కాపురానికి తీసుకొచ్చారు. అయినా కిరణ్‌తో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న రాణి చివరికి తన భర్త రవిని అడ్డు తప్పించాని భావించింది. 2017 ఆగస్టు 14న ఉదయం రవి తన తండ్రి, భార్య రాణితో కలిసి బెండతోటకు కాయలు కోయటానికి వెళ్లారు. మధ్యలో తండ్రి పశువుల్ని తోలుకెళ్లటానికి ఇంటికి వచ్చాడు. పథకం ప్రకారం ఆ సమయంలో కిరణ్ బైకుపై పొలం వద్దకు వచ్చాడు. బెండతోటలో కాయలు కోస్తున్న రవిని గొంతు పట్టుకొని కింద పడేశాడు. పక్కనే ఉన్న రాణి కొండరాయి తీసుకొని రవి తలపై మోదింది. అనంతరం రాణి భర్త కాళ్లు పట్టుకోగా, ప్రియుడు బండరాయితో రవి తలపై మోదటంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అనంతరం కిరణ్ వెళ్లిపోయాడు. రాణి ఊర్లోకి వచ్చి.. తన భర్తను ఎవరో కొట్టి వెళ్లిపోతున్నారని తప్పుదారి పట్టించింది. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

▶ 2లో

లింగ వివక్షపై విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి - అమరావతి

లింగ వివక్షతపై మండల కేంద్రమైన అమరావతిలోని గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్త్రీ - పురుష సమానత్వం, బాల్య వివాహాలు, భ్రూణ హత్యలపైన అవగాహన కల్పించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి వివరించారు. ప్రిన్సిపాల్ బిపిఆర్ ఇందిరా ప్రియదర్శిని, అంగన్వాడి సూపర్వైజర్ షేక్ పెద్ద హిమాంబి, భారతదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అభివృద్ధి చేయకనే చంద్రబాబు సవాలును స్వీకరించని జగన్ : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి పాలనలో అభివృద్ధి చేసింది ఏమీ లేదు కావట్టే చంద్రబాబు సవాలును సిఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వీకరించలేదని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఓటమి భయంతో జగన్మోహన్‌రెడ్డి 77 మంది కుర్చీలను మడత పెట్టారని, 50 రోజుల్లో జగన్‌రెడ్డిని పూర్తిగా మడతపెట్టి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లి చూసిన జగన్‌రెడ్డి ఐదేళ్ల విధ్వంస పాలనతో నష్టపోయిన ప్రజలు కనిపిస్తున్నారని దుయ్యబట్టారు. మేనిఫెస్టోలో మద్యపాన నిషేధం అని చెప్పి బెల్ట్ షాపులతో, నాసిరకం మద్యంతో దోపిడీ చేసిన జగన్‌రెడ్డి 35 లక్షల ప్రజలను అనారోగ్య పాలు చేసి, ఐదువేల మందికి పైగా బలి తీసుకున్నాడని విమర్శించారు. అనంతపురం జిల్లా రాప్తాడు సిఎం సభలో ఏబీఎన్ ఫొటో జర్నలిస్టుపై వైసిపి మూకలు చేసిన మూకుమ్మడి దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పి.నాగేశ్వరరావు, ఆయుబ్‌ఖాన్, గోవిందరాజులు, మురళి, పి.దాసయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి ఆర్డీఓ వి మురళీ కష్ణ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సత్తెనపల్లి మండలం గర్నెపూడి, పెదమక్కెన, గుడిపూడి, నందిగామ గ్రామాల్లో ఆర్డీఓ మురళీ కష్ణ సోమవారం పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంప్ సౌకర్యాలను తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో 80 సంవత్సరాలు పై బడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, మంచానికే పరిమితం అయిన ఓటర్లు , వికలాంగ ఓటర్లను గుర్తించాలని బిఎల్‌ఓల ను ఆర్డీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బోసుబాలు, బిఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

దుర్గి మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా కొమ్ము కౌసల్య

ప్రజాశక్తి - కారంపూడి

మాచర్ల నియోజకవర్గంలోని దుర్గి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా కారంపూడికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కొమ్ము చంద్రశేఖర్ కుమార్తె కౌసల్య నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా గాదెవారిపల్లికి చెందిన గురజాల రామారావు, సభ్యులుగా బొల్లెద్దు ఇన్నయ్య, చింత లక్ష్మి నరసయ్య, కందుకూరి కాసమ్మ, బోయిన నరసమ్మ, రామావత్ లక్ష్మిభాయి, మాచర్ల అన్నపూర్ణమ్మా, బైనబోయిన గోపమ్మ, దేవరకొండ సామ్రాజ్యం, బత్తుల రాజమ్మ, షేక్ సన్నాయేల జనమ్మ, కాయిటి వెంకటరెడ్డి, కాపలవాయి సూర్యనారాయణ, చింత చిన్ననరసింహారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తన నియామకానికి సహకరించిన పిన్నెల్లి సోదరులకు నూతన చైర్‌పర్సన్ కౌసల్య కృతజ్ఞతలు తెలిపారు. పలువురు దళిత నాయకులు పినెల్లి సోదరులను కలిసి ధన్యవాదాల చెప్పారు.

'పది' పరీక్షలపై పూర్తిగా అవగాహన కలగాలి : డిఇఒ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని మన్యం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలను ఆయన సోమవారం సందర్శించి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మనోధైర్యంతో పరీక్షలు రాయాలని, ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధ కావాలని సూచించారు. ఆందోళన పడకుండా పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, ఉపాధ్యాయులు పూర్తిగా సహకరిస్తారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న సబ్జెక్ట్ కాంప్లెక్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంఇఒ ఒంగోలు రాజు, హెచ్‌ఎం ధనలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ మెన్స్ సీనియర్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను జిల్లా సెక్రటరీ ఎం.సుబ్బరాజు పర్యవేక్షించారు. ఇక్కడ ఎంపికైన వారు విశాఖలో వచ్చేనెల 3, 4, 5 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని సుబ్బరాజు తెలిపారు. ఎంపికలకు వివిధ ప్రాంతాల నుండి 90 మందికి పైగా క్రీడాకారులు హాజరైనట్లు కళాశాల సెక్రటరీ - కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. జట్టుకు ఎంపికైన వారిని కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఒగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, ఫిజికల్ డైరెక్టర్ దారా మహేష్ అభినందించారు.

దేశంలోనే గుర్తింపు పొందిన వాలంటీర్లు వ్యవస్థ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఈపూరు

వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్ల వ్యవస్థ కు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వాలంటీర్ల సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సేవా మిత్ర,సేవా రత్న,సేవా వజ్ర పురస్కారాలను ఎంపికైన వారికి ఎమ్మెల్యే బొల్లా అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో వాలంటీర్లు అందించిన సేవలను గుర్తు చేశారు.ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిల పని చేశారని పార్టీలకతీతంగా ఇంటి వద్దకు సంక్షేమ పథకాలను చేర్చడంలో వాలంటీర్లు విజయం సాధించారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామంటున్నారని ప్రజా సంక్షేమం కోసం వాలంటీర్ల వ్యవస్థ అవసరమన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును ఈడి కేసులు వెంటాడుతున్నాయని కేసుల నుండి తప్పించుకునేందుకు బిజెపి నేత అమిత్ షాను తరచూ దర్శనం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల సొమ్మును నేరుగా లబ్ధారుల ఖాతాలో జమ చేసిందని, టిడిపి పాలనలో జన్మభూమి కమిటీలను పెట్టి ప్రజాధనాన్ని దోచుకున్నా రన్నారు.నీరు చెట్టు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, మిర్చి నష్టపరిహారం, వ్యవసాయ బావుల పేరుతో వేల కోట్లు టిడిపి కంపెనీలకు చేరిందన్నారు. స్థానిక ప్రతిపక్ష నాయకుడు జీవి ఆంజనేయులు చెరువులు మట్టికి, గుళికలకు రంగులు పూసి మోసపూరిత ఎరువుల వ్యాపారం చేస్తూ కోట్లు దండుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధిక, వైస్ ఎంపీపీలు జి.భాగ్యలక్ష్మి, కె.వరుణ్ కుమార్, జెడ్‌పిటిసి టి.చౌడయ్య, ఎంపీడీవో ఏవి రంగనాయకులు, వ్యాపారవేత్త బొల్లా రమేష్, శాఖమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకట హనుమయ్య,బొల్లా బుజ్జి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సమస్యలు రానియ్యొద్దు : రజిని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : ఆటో డ్రైవర్లకు ఎలాంటి సమస్యలు రానీకుండా చూడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. స్థానిక చంద్రమౌళి నగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం మంత్రి ఆటో డ్రైవర్ల సమస్యలపై రోడ్డు రవాణా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాత చలాన్ల చెల్లింపు విషయంలో గడువు ఇవ్వాలని కోరారు. సిగ్నల్ వయొలేషన్ విషయంలో నిబంధనలు అనుసరించాలని, చిన్న చిన్న వాటికి కూడా జరిమానాలు విధించే పరిస్థితులు ఉండకూడదని పేర్కొన్నారు. పోలీసు, రోడ్డ రవాణా అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని తెలిపారు. గఆటో డ్రైవర్ల విషయంలో అనవసరపు ఇబ్బందులు రాకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మురళీ శ్రీనివాస్, శ్రీను, లాలూ నాయక్, మరళీ , కొండలు, శివకోటిరెడ్డి, రవి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై కొరడా

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ సస్పెండ్ చేశారు. వాల్ ఆపరేటర్ చెంచయ్యను ఉద్యోగం నుంచి తొలగించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.కోటేశ్వరరావు పూర్తిస్థాయి పర్యవేక్షణ లోపం ఉన్నందున షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో డ్రెయిన్లలో పూడిక తొలగింపులో నిర్లక్ష్యం, పారిశుధ్య పనుల్లో భాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రాము, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు ఎన్.అంజనేయులు, డి.వెంకటసురేష్‌ను విధుల నుండి సస్పెండ్ చేస్తూ, శానిటేషన్ సూపర్వైజర్ ఆయుబ్ ఖాన్ పర్యవేక్షణ లోపంపై షోకాజ్ నోటీసు జారీ చేశారు.

శారదాకాలనీ ప్రాంతంలో ఇష్టానుసారంగా ట్యాప్ కనెక్షన్లు ఇవ్వడం, పాత పైపులైన్లు డమ్మీ చేయకుండా కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయడాన్ని ఇంజినీరింగ్ అధికారులే తప్పుపట్టారు. దీనివల్ల రెండు పైపులైన్లలో మురుగునీరు చేరి ప్రజలు కలుషిత నీరు తాగి డయేరియా బారిన పడ్డారని గుర్తించారు. డయేరియా అనుమానిత లక్షణాలతో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందగా దాదాపు 250 మంది ఆస్పత్రుల పాలయ్యారు. ఇంకా అనేక మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. శారదా కాలనీలోని 10 లైన్లలో పాత పైపు లైన్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని గుర్తించారు. మురుగునీటి కాల్వల పక్కనే తాగునీటి పైపు లైన్లు తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం వల్ల పైప్ లైన్ లీకులు, సైడ్ కాల్వల్లో, సమాంతరంగా ఉన్న పైప్ లైన్లను, నీటి కుళాయిలు ఉండటం వల్ల నీరు కలుషితం అవుతుందని ఉన్నతాధికారులు నిర్ధారించారు. తాజా సమాచారం ప్రకారం ఏఈల పనితీరుసరిగా లేనందువల్ల ఇంజినీరింగ్ విభాగం పనుల బాధ్యతలను ఎమినిటీస్ కార్యదర్శులకు అప్పగించాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. రాష్ట్రంలోని కొన్ని కార్పొరేషన్లలో ఇదేపద్ధతి అమలులో ఉందని తెలిసింది. దీంతో గుంటూరులో కూడా ఇదేరీతిలో ఎమినిటీస్ కార్యదర్శులకు పూర్తిస్థాయిలో ఏఈల బాధ్యతలను అప్పగిస్తే కొంతమేరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెరుగుతుందని కమిషనర్ చేకూరి కీర్తి భావిస్తున్నారు. ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

హత్య కేసులో భార్య, ప్రియుడుకి జీవిత ఖైదు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసుల దర్యాప్తులో నిజాలు తేలటంతో రాణి, ఆమె ప్రియుడిపై సిఐ ఎం.మధుసూదనరావు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో దోషులకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమాన విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసం సూరిబాబు వాదించారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టటంలో తాడేపల్లి కానిస్టేబుల్ ఈదర వెంకటేశ్వరరావు చొరవ చూపారు.

గ్రూప్-2లో నూతన సిలబస్

(మొదటి పేజీ తరువాయి)

ఉంటాయన్నారు. ఇది కొత్త సబ్జెక్ట్ అయిన కారణంగా అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉండేలా మెటీరియల్‌ను రూపొందించామని, 25 వేల మందికి ఉచితంగా అందించామని చెప్పారు. కొత్త సిలబస్‌లో భారత సమాజానికి సంబంధించిన కులం, మతం, వివాహం, జాతి, తెగ, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలకు రాజ్యాంగం కల్పించిన రక్షణలు తదితర అంశాలు ఉంటాయని వివరించారు. మెయిన్ ఎగ్జామ్ ఎన్నికల తర్వాత జూన్ లేదా జులైలో ఉండే అవకాశం ఉందని, దానికి సంబంధించి కూడా మెటీరియల్‌ను సమకూర్చే ప్రయత్నం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు తిరుపతిస్వామి, జాఫర్, అభ్యర్థులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్టు

చేబ్రోలు పోలీస్ స్టేషన్ లో వివరాలు వెల్లడిస్తున్న తెనాలి డిఎస్‌పి ఎం.రమేష్

ప్రజాశక్తి - చేబ్రోలు: చెడు వ్యసనాలకు బానిసలై, గంజాయిని కొనుగోలు చేసి అమ్మడానికి తరలిస్తున్న ఐదుగురు యువతను చేబ్రోలు పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై తెనాలి డిఎస్‌పి ఎం.రమేష్ చేబ్రోలు పోలీస్ స్టేషన్ లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. చేబ్రోలు ప్రధాన రహదారిపై ఆదివారం పొన్నూరు రూరల్ సీఐ వై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చేబ్రోలు ఎస్ ఐ పి.మహేష్ కుమార్, సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో కొమ్మ మూరు కెనాల్ వద్ద గంజాయి తరలిస్తున్న, ప్రత్తిపాడు, పొన్నూరుకు చెందిన ఐదుగురు యువకులను అరెస్ట్ చేశారు. పొన్నూరు నుండి గుంటూరు వైపు చేబ్రోలు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు గంజాయి అమ్మటానికి వెళుతున్న ముగ్గురు వ్యక్తులు తనిఖీ సమయంలో పారి పోయేందుకు యత్నించారు. పోలీసులు అనుమానంతో వారిని వెంబడించారు. దీనిపై ముగ్గురు వ్యక్తులను పట్టుకొని విచా రణ చేయగా రూ.30,000 విలువగల కిలో గంజాయి స్కూటీ లో గుర్తించి సీజ్ చేసినట్లు చెప్పారు.

ఒరిస్సాకు చెందిన వ్యక్తులు ప్రత్తిపాడు మండలంలోని బోయ పాలెంలో నివసిస్తున్నారని వారి నుండి ఈ గంజాయి కొనుగోలు చేసినట్లు చెప్పారు. చీరాల, పొన్నూరు రైల్వేస్టేషన్ సెంటర్లలో, పొన్నూరు, చేబ్రోలు లోని కాలేజీల వద్ద ఈ గంజాయిని విక్రయిస్తున్నట్టు విచారణలో తెలిపారు. ఈ కేసులో పొన్నూరు టౌనుకు చెందిన షేక్ ఫసల్, పొన్నూరు మండలం కట్టెంపూడికి చెందిన నున్న యశ్వంత్, పత్తిపాడు మండలానికి చెందిన సరాటోల రమాకాంత్, ఆసీస్ కుమార్ పాండా, పొన్నూరు టౌన్ కు చెందిన పదిహేడేళ్ల బాలుడు, గుర్తు తెలియని ఒక వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. వీళ్ల కొంతకాలంగా చీరాల రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొని దానిని తీసుకునే అలవాటు చేసుకున్నారని చెప్పారు. చీరాల రైల్వే స్టేషన్ వద్ద గంజాయి విక్రయించే వారు రాకపోవడంతో అది అమ్మే వారి కోసం ఆరా తీసి పత్తిపాడు మండలంలోని బోయపాలెంలోని ఆంజనేయ స్వామి బొమ్మ వద్ద బడ్డీ కొట్టు నడుపుతున్న ఒరిస్సా కు చెందిన రమాకాంత్ , ఆసీస్ కుమార్ పాండా వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పారు. కొంత గంజాయి తీసుకుని, మిగిలిన దానిని అధిక రేటుకు వారు అమ్ముకుంటున్నట్లు చెప్పారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ : స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు ప్రక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన సత్తెనపల్లి మం డలం గండ్లూరు అడ్డరోడ్డు సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది.సత్తెనపల్లి పట్టణంలోని యూనిక్ కాన్సెప్ట్ స్కూల్ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. సత్తెనపల్లి నుండి 40 మంది చిన్నారులతో

పాకాల పాడు వెళుతున్న బస్సు పొలా ల్లోకి వెళ్ళింది. డ్రైవర్ ప్రసాద్ కు కళ్ళు తిరగడంతో బస్సు ను పొలాల్లోకి పోనిచ్చాడు. విద్యార్థులు ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడ్డారు. పాకాల పాడు అబ్బూరు, ఫణిదం, భట్లూరు గ్రామంలో పిల్లలను ఇంటి దగ్గర వదిలి పెట్టేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద వార్త విన్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పిల్లలకు ఎలాంటి గాయాలు కాకపోవటంతో వారి తల్లి దండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పిల్లలను ఆటోలు ద్వారా వారిఇళ్ళ వద్ద వదిలి పెట్టారు. ఈ ప్రమాద ఘటనపై ఎంఇఒ విచారణ చేపట్టారు.

ఫోటో జర్నలిస్ట్‌పై దాడిపై నిరసనలు

అదనపు ఎస్పీ రాఘవేంద్రకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్ట్ సంఘాల నాయకులు

తాడేపల్లి టిడిపి కార్యా లయంలో మాట్లాడుతున్న సుందరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : అనంతపురం జిల్లా రాప్తాడు వైసిపి సిద్ధం సభకు వృత్తిలో భాగంగా వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ కృష్ణపై దాడి చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్ట్ చేసి కఠి నంగా శిక్షించాలని ఎపిడబ్ల్యూజె పల్నాడు జిల్లా కమిటీ, నరసరావు పేట ప్రెస్ క్లబ్ ఖండించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆర్. రాఘవేంద్రకు, జిల్లా కలెక్టర్ కార్యా లయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇంచార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి అజయ్‌కుమార్‌లకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యూజె పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు నంద్యాల జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్తులో ఈ ఘటనలు పున రావృతం కాకుండా అవకాశం ఉంటుందన్నారు. దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయని పక్షంలో జర్నలిస్ట్ సంఘాలను ఐక్యం చేసి ఉద్యమం చేపడతామని హెచ్చ రించారు. కార్యక్రమంలో ఏపిడబ్ల్యూజె జిల్లా కార్యదర్శి నాగరాజు, విలేకరులు శ్రీనివాస రావు, లక్ష్మయ్య, చంద్రశేఖర్, సత్యనారాయణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సిహెచ్ రమణారెడ్డి, ఎ.అప్పారావు, ఎస్. సాంబశివరావు, టి.శ్రీనివాస్, పి.రామా రావు, జి.శ్రీని వాసరెడ్డి, స్వర్ణ నాగ రాజు, జె. శ్రీనివాసరావు, సత్యనారా యణ, కె.పూర్ణ చం ద్రరావు, పచ్చవ బుజ్జిబాబు పాల్గొ న్నారు. **ప్రజాశక్తి - మాచర్ల :** అతి తక్కువ వేతనాలతో జర్నలిజంపై మక్కువతో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే విలే కరులపై విచక్షణారహితంగా దాడులు చేయటం అమానుష మైన చర్య అని తెలుగు దేశం పార్టీ ఇం చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరులతో ఆయన మాట్లాడారు. బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో చేశారు. ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. **ప్రజాశక్తి- తాడేపల్లి:** ఫోటో గ్రాఫర్‌పై దాడిని టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందర రావు యాదవ్ ఖండించారు. తాడేపల్లి టిడిపి కార్యా లయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫోటో గ్రాఫర్‌పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి సీని యర్ నాయకులు కేళి వెంకటేశ్వరరావు, ఇట్టా భాస్కర్, చల్లా శ్రీను, వేల్పుల భాగ్య లక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్:** సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్ టిడిపి ప్రజావేదికలో టిడిపి, జనసేన నాయకులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. **ప్రజాశక్తి-చిలకలూరి పేట:** విలేకరులపై దాడి అమానుషమని టిడిపి పల్నాడు జిల్లా ఆర్గ నైజిం గ్ సెక్రె టరి అందల శారి అన్నారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 1,48,759
మిర్చి ఎగుమతి	: 1,33,190
మిర్చి నిల్వ	: 95,912

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,500 - 19,500
నెం.5	14,500 - 17,500
273	12,500 - 18,500
341	9,000 - 21,500
నాన్ ఏసి	
తేజ	8,500 - 21,000
బడిగి	11,000 - 20,000
దేవనూరు డీలక్స్	11,000 - 20,200
తాలుకాయలు	5,000 - 13,000

మద్యం స్వాధీనం..ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని నారా కోడూరు గ్రామం అవుట్ కట్స్ లో సోమవారం అక్రమంగా మద్యం నిల్వ ఉంచి అమ్ముతున్న యానం ప్రసాద్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి. మహేష్ కుమార్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధానిలోని లింగాయపాలెం వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డు పై సోమవారం సాయంత్రం ప్రమాదం జరిగింది.విజయవాడ వైపు నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీ కొట్టింది. దీంతో బైక్ పై వెళ్తున్న హైకోర్టు లాయర్ జితేంద్ర కాలు విరిగింది. ఆయనతో పాటు పక్కనే గ్రీనరీ పనులు చేస్తున్న కార్మికుడు రాజేశ్ కు తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదంలో బైక్ నుంచి మంటలు చెలరేగి బైక్ దగ్ధమైంది.కారు రోడ్డు పైనుంచి పక్కనే ఉన్న కందకంలో పడిపోయింది.పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజశ్రీ బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో.

H.M.OP.No: 48/2023

మధ్య:
అన్నం ఉమాదేవి ..పిటిషనర్
వర్సెస్
అన్నం సురేష్ .. రెస్పాండెంట్
టు :
అన్నం సురేష్, తండ్రి శ్రీనివాసరావు ,టైలర్, 7వ వార్డు, సాయి నగర్, నిడుబ్రోలు గ్రామం, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా.

పై నంబర్ కేసులో పిటిషనర్ అయిన అన్నం ఉమాదేవి రెస్పాండెంట్ నుండి విడాకులు కోరుతూ H.M.OP. No:48 / 2023 శ్రీయుత ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు బాపట్ల నందు పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. రెస్పాండెంట్ కు నోటీసులు అందనందువలన ఇందు విషయమై రెస్పాండెంట్ కి ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల 4- 3- 2024 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై వారి అభ్యంతరములు తెలుపుకొనవచ్చును లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ..
వాయిదా తేదీ:4-3-2024 .

కుర్రా రవి
పిటీషనర్ తరపు అడ్వకేట్, బాపట్ల.
సెల్:9866488435.

అప్పీలు నోటీసు

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

సి.ఎమ్.ఎ.నెం.1/2022

శిరిమెల్ల ఆంజనేయులు మరియు ఇతరులు
...అప్పెలంట్లు/వాదులు
వర్సెస్
ఆవుల అంకిరెడ్డి మరియు ఇతరులు
.. రెస్పాండెంట్లు/ప్రతివాదులు
టు
7వ రెస్పాండెంట్
రొండా బ్రహ్మరెడ్డి,తండ్రి కొండారెడ్డి, ఆర్/ఓ. నర్శనాయునిపాలెం గ్రామం, వినుకొండ మండలం, వినుకొండ D.M.C.పల్నాడు జిల్లా.

పై నెంబరు C.M.A.ని అప్పిలెంట్లు పై కోర్టులో దాఖలు చేయగా మీ నోటీస్ నిమిత్తం 23.02.2024 తేదీకి వాయిదా వేయబడినది. కావున మీరు స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని పై తేదీన ఉదయం 10.30 ని.లకు పై కోర్టు ఎదుట హాజరై మీ ఆక్షేపణ లు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 23.02.2024

ఇట్లు
గడ్డి శ్రీనివాసులు,
అప్పిలెంట్ల తరపు న్యాయవాది,
దరిశి, ప్రకాశం జిల్లా.
సెల్:9441125875

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS:;GUNTUR
(Application for reference of a Dispute to Arbitration)
DISPUTE.No.124/2019

Between:
M/s.Chalapathi Chit Fund (P) Ltd., Guntur Rep. by its Manager/Foreman. ...Disputant
Vs.
Mr. Sadhupati Venkata Ramana and 5 others ...Opponents
Opp-2. Mr. Yadavalli Vijaya Ramesh S/o.Y.Anantha Rao A/a. 48yrs. W/as. S.G.Teacher, M.P.P.School, Indragiri (V), Rompicharla Mdl, Guntur Dt. presently palnadu Distict.

Please take notice that the above Dispute is filed against Opponent No.2 of you and 5 others for Recovery of Claim Amount and the same is posted on 05.03.2024 for the Appearance of you Before the Hon'ble Deputy Registrar of chits, Guntur at 2.00 pm. If you fail on that day that day the matter will be heard and decided ex-party basis on the material available.

(By the order of The Deputy Registrar of Chits)

M/s.Chalapathi Chit Fund (P) Ltd.,Guntur
Rep. by its Branch Manager.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

HMOP 105/2023

బిట్వీన్ :
Vuyyuru Chandra .... పిటీషనర్
Vs
Vuyyuru Mallikharjuna Rao ... రెస్పాండెంట్
To,
Vuyyuru Mallikharjuna Rao, S/o Venkateswarlu, Door No. 12-5, Mazid Road, Near Water Tank, Chebrolu Village & Mandal, Guntur District.

పై నెంబరు పిటీషన్‌లో పిటీషనరు విడాకుల నిమిత్తం సదరు పిటీషను దాఖలు చేసియున్నందున మీ హాజరు నిమిత్తం ది. 1-3-2024వ తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా : 1-3-2024

ఎస్.మస్తాన్,
పిటీషనర్ తరపు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 98481 98531

N-864 ఈపూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్

ఇ- ప్రొక్యూర్ మెంట్- టెండరు ప్రకటన

పల్నాడు జిల్లా, ఈపూరు మండలం, ఈపూరు గ్రామం నందు సర్వే నెం.178-3/1,178-3-2 (1.33 ఎకరాలు)లలో 10,886.36 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజ్ శీతల గిడ్డంగి నిర్మాణము, మిషినరీ, కండెన్సర్ ట్యాంక్ మరియు మెషినరీ హాలు నిర్మాణము మరియు ఎలక్ట్రికల్, మెకానికల్ వర్క్సు ఇతర నిర్మాణముల కొరకు టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ నెం.01 కొరకు బిడ్స్ దాఖలకు చివరి తేదీ.26-02-2024. మధ్యాహ్నం 12-00 గం.లు. వివరాల కొరకు చూడండి.
www.apeprocurement.gov.in (second call) Tender ID 723687

DIPR NO:-1/PACS/CS/IPUR/2023-24 సం/-Chief Executive Officer

జస్టిస్ చిత్రాలకు మరో రెండు అవార్డులు

ప్రజాశక్తి - వినుకొండ

చిత్ర కళాపోటీల్లో పట్టణానికి చెందిన వజ్రగిరి జస్టిస్ రెండు బహుమతులను గెలుచుకున్నారు. వీటిని విజయవాడ, గుంటూరులో సోమవారం అందుకున్నారు. మిచౌంగ్ తుపాను అంశంపై ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక గత నెలలో పోటీలు నిర్వహించగా జస్టిస్ 'ప్రథమ బహుమతి'గా ప్రతిష్టాత్మకమైన 'బాపు' అవార్డును, గుంటూరు క్రియేటివ్ ఆర్ట్ అకాడమీ వారు జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో స్టిల్ లైఫ్ చిత్రనికి 'జాతీయ ఆర్ట్ లెజెండ్' అవార్డును అందుకున్నారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

వేల్పూరులో తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి - వినుకొండ

శావల్యాపురం మండలం వేల్పూరులో జలజీవన్ మిషన్ తాగునీటి పథకాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సోమవారం ప్రారంభించారు. రూ.కోటితో గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లోని 800 గృహాలకు నీటి కుళాయిలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గంటవారిపాలెం నుండి వేల్పూరుకు తారు రోడ్డును నిర్మించామని, గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ హెల్త్ సెంటర్ల నిర్మాణంతో పాటు సొసైటీ బ్యాంకు ద్వారా కోల్డ్ స్టోరేజ్, గోదాము నిర్మాణం, కాల్వ కట్టలపై రోడ్డు నిర్మాణం చేపట్టామని, జంక్షన్ నుండి కాల్వ కట్ట వరకు సిసి రోడ్డు నిర్మించామని వివరించారు. కార్యక్రమంలో అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కృష్ణవేణి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో చెన్నయ్‌కు చెందిన ఇంటిగ్రేటెడ్ ఎంటర్ప్రైజెస్ (ఇండియా) కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాలేజీకి చెందిన 18 విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాతని వెంకటేశ్వర్లు తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారిని అకాడమిక్ డైరెక్టర్ కె.మేగేశ్వరరావు, టిపిఒ ఎం.బాల కోటేశ్వరరావు అభినందించారు.

భూమి కోసం జగనన్నకు చెబుదాంకు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం కింద ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిల్లో అధికంగా భూ వివాదాలు, ఆక్రమణలకు సంబంధించినవి ఉన్నాయి. ప్రజల నుండి 120 అర్జీలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, స్పెషల్ కలెక్టర్ నారదముని స్వీకరించారు. అర్జిదార్లకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు.

పునరావాసం కోసం 15 ఏళ్లుగా

పునరావాసం కల్పించాలని మాచవరం మండలం వెల్లంపల్లికి చెందిన పులిచింతల ముంపు బాధితులు విన్నవించారు. పోతురాజు వెంకటేష్, గొర్రె శంకరరావు మాట్లాడుతూ డాక్టర్ కె.ఎల్ రావు పులిచింతల సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన బాధితుల్లో తాము ఉన్నామని చెప్పారు. పిడుగురాళ్ల మండలం కరాలపాడు లేఅవుట్-1లో కొంతమందికి పునరావాసం కల్పించారని, మిగిలిన వారికి లేఅవుట్-2లో కొన్ని ప్లాట్లతో పాటు పడమర వైపు ఉన్న 70 సెంట్ల స్థలాన్ని సర్వే చేసి ముంపు బాధితులకు పంపిణీ చేయాలని కోరారు. పునరావాసం కోసం 15 ఏళ్లుగా తిరుగుతున్నా సరైన న్యాయం చేయడం లేదని వాపోయారు.

స్థలం తక్కువగా నమోదు చేశారు

అమరావతి మండలంలో వారసత్వంగా వచ్చిన 1.43 ఎకరాల్లో అరెకరం పొలాన్ని విక్రయించారని, 93 సెంట్లకు బదులు సర్వే చేసిన అధికారులు 82, 83, 86 సెంట్లు ఉందంటూ రకరకాలుగా నివేదికిచ్చారని గుంటూరు జిల్లా వింజనంపాడుకు చెందిన నంబూరి గోవర్ధనరావు ఫిర్యాదు చేశారు. రికార్డులు సరిగా ఉన్నా చివరకు 87 సెంట్లకు రిపోర్టు ఇచ్చి 6 సెంట్లకు ఇవ్వడం లేదని, దీనిపై తహశీల్దార్ కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరిగినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు.

స్థలాన్ని ఆక్రమించి సగం ఇస్తామంటున్నారు

పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువులో వారసత్వంగా సంక్రమించిన 1.94 ఎకరాల్లో పక్క పొలం ఉన్న రైతు గున్నంరెడ్డి సుబ్బారెడ్డి 6 సెంట్లు ఆక్రమించారని, సర్వేకు దరఖాస్తు చేసుకోగా సర్వే అధికారులను రానివ్వకుండా అడ్డుకుంటున్నారని పిడురాళ్ల మండలం కరాలపాడుకు చెందిన వడితే సేవినాయక్ ఫిర్యాదు చేశారు. దీనిపై తాము సర్వేయర్‌ను అడగగా వివాదంలో ఉన్న 6 సెంట్లలో చెరిసగం నమోదు చేస్తానని చెబుతున్నారని, సర్వేయర్ డబ్బులు తీసుకొని తనకు అన్యాయం చేయాలని చూస్తున్నారని వాపోయారు.

అన్న కుమారులే మోసం చేశారు

40 ఏళ్ల క్రితం తండ్రి కొనుగోలు చేసిన 3.32 ఎకరాల భూమిని ఉమ్మడి కుటుంబం కావడంతో కుటుంబ పెద్దగా ఉన్న తన అన్నయ్య పేరిట ఉంచామని, అన్నయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా తమకు వారసత్వంగా రావాల్సిన 1.66 ఎకరాలను అన్నయ్య కుమారులు ఇవ్వడం లేదని మండల కేంద్రమైన వెల్దుర్తికి చెందిన దేశావత్ కృష్ణనాయక్ ఫిర్యాదు చేశారు. అన్నయ్య కుమారుల్లో పెద్ద కుమారుడు గురజాల మండల పరిషత్ అధికారిగా పని చేస్తున్నారని, దీంతో రెవెన్యూ అధికారులు కూడా తనకు న్యాయం చేయడం వాపోయారు.

'రూ.10 ఇచ్చి రూ.100 దోచుకోవడమే జగన్ సంక్షేమం'

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పత్తిపాటి పుల్లారావు

ప్రజావేదిక కూల్చివేతతో రాష్ట్రంలో వైసిపి విధ్వంస పాలన మొదలైందని, రూ.10 ఇచ్చి రూ.100 దోచుకోవడం జగన్ సంక్షేమమని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. స్థానిక పండరిపురంలోని తన నివాసంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సిద్ధం సభల పేరుతో ప్రజల్ని మరోసారి మోసం చేయడానికి వైసిపి సిద్ధమైందని, ఈ ఐదేళ్లలో పాలనపై చర్చకు సిఎం సహా వైసిపి నాయకులు సిద్ధమా? అని సవాలు విసిరారు. ఇసుక, మైనింగ్, మద్యం, కాంట్రాలతో రూ.వేల కోట్లు దోచేశారని, హత్యలు, అరెస్టులు, కూల్చివేతల రాజకీయాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాలని దుయ్యబట్టారు. దేశంలోనే అత్యంత ధనిక సిఎంగా ఉన్న జగన్‌కు పేదల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అన్ని వర్గాల్ని మోసం చేసిన సైకోకు సామాజిక న్యాయం ఊసెత్తే నైతికత ఉందా? అని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టుల్ని గాలికొదిలేసి రాయలసీమను ఎండబెట్టిన ద్రోహి జగన్ అని విమర్శించారు. జగన్ పేరు చెబితే రాష్ట్రంలో గుర్తొచ్చేది అధిక ధరలు, పన్నులు, ఛార్జీల పెంపు, అప్పులు, మోసాలు, దొంగ ఓట్లు, ఫ్యాక్షన్ వేధింపులు, రక్త చరిత్రలేనన్నారు. జర్నలిస్టులపై ఎందుకు దాడులకు పాల్పడుతున్నారని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరవడానికి జనం సిద్ధంగా ఉన్నారని అన్నారు.

దాడులకు నిరసనగా జర్నలిస్టుల మానవహారం

జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి కెమెరామెన్‌పై జరిగిన దాడిని చిలకలూరిపేట ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఖండించారు. ఈ మేరకు స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్‌లో జాతీయ రహదారిపై సోమవారం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం ఇచ్చారు. నయకులు పి.భక్తవత్సలరావు, మస్తాన్‌వలి మాట్లాడుతూ కెమెరామెన్‌పై దాడి ప్రభుత్వ పిరికిపంద చర్యన్నారు. వైసిపి పాలనలో మీడియాకు స్వేచ్ఛ లేకుండా పోయిందని దీనిపై సిఎం సత్వరమే స్పందించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతి ఈనాడు విలేఖరిపై దాడి చేసిన వారిపైనా కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎ.శేషగిరిరావు, అబ్దుల్ సత్తార్, అల్లాబక్షు, ఎం.కోటేశ్వరరావు, ఎన్.బాబ్జీరావ్, నారాయణస్వామి, పి.వెంకట్రావు, షేక్ ఫక్రుద్దీన్, ఎ.ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. పలువురు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే మీడియా ప్రతినిధులపై దాడులు దారుణమన్నారు. అమరావతిలోనూ పాత్రికేయునిపై దాడి చేశారని, వీటిని చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా? రాచరిక వ్యవస్థలో జీవిస్తున్నామా? అనే నుమానం కలుగుతోందని అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యల కోసం డీఎస్పీ హరినాథ్‌బాబుకు వినతిపత్రం ఇచ్చారు. అజయ్ కుమార్, శ్రీనాథ్, హనుమంతరావు, చెన్నకేశవరావు, మాధవ పాల్గొన్నారు.

డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న మీడియా ప్రతినిధులు

రెండ్రోజుల్లో అరెస్టు చేయకుంటే ఉద్యమం

ప్రజాశక్తి-దాచేపల్లి : మహిళను లైంగికంగా హింసించిన ఘటనలో కానిస్టేబుల్‌పై కేసు నమోదుతోపాటు రెండ్రోజుల్లో అరెస్టు చేయకుంటే ఆందోళనకు పూనుకుంటామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు చెప్పారు. ఇటీవల దాచేపల్లిలో మహిళను ఓ కేసు విషయమై బెదిరించి లైంగికంగా వేధించిన ఘటనలో బాధితురాలికి న్యాయం కోసం పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్‌ను ఇప్పటికే విఆర్‌లో పెట్టినట్లు ఎఎస్‌పి చెప్పగా విచారణ పేరుతో వారం రోజులు సాగదీశారని, నిందితుణ్ణి కాపాడ్డానికే ఇదంతా చేస్తున్నట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కేసులో రాజీకి రావాలని మహిళపై నిందితుడు మరోవైపు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసిందని, కావున సత్వరమే అరెస్టు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఐద్వా జిల్లా కార్యదర్శి జి.రజిని, నాయకులు ఉమశ్రీ, దుర్గాబాయి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు ఉన్నారు.

'రాజకీయ దళారి జూపూడి ప్రభాకర్'

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్ : అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి పేరు మార్చి జగనన్న విదేశీ విద్యగా చేయడాన్ని సమర్థిస్తూ ఆ పార్టీ నాయకులు జూపూడి ప్రభాకర్ మాట్లాడ్డం సరైందని కాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు డి.జ్ఞానరాజ్‌పాల్, దళిత మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు కె.అంథోని విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. చంద్రబాబు హయాంలో విదేశీ విద్యకు కేటాయింపుల కంటే జగన్ ప్రభుత్వంలో ఎక్కువ కేటాయించిన కారణంగా పేరు మార్పు సరైంది అని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాధించిన రాజకీయ రిజర్వేషన్ ద్వారా లబ్ది పొందిన రాజకీయ దళారీ జూపూడి ప్రభాకర్ అని, దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన ఆయనకు దళితులు తగిన బుద్ధి చెబుతారని విమర్శించారు. రాజకీయ స్థిరత్వం లేని జూపూడి ప్రభాకర్ నోటిని అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని 22న ప్రదర్శనలు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి దీప్తి

అంగన్‌వాడీల రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా ప్రభుత్వ ఒప్పందం మేరకు జిఒలు తక్షణమే జారీ చేయాలని కోరుతూ ఈనెల 22న మండల కేంద్రాలలో ప్రదర్శనలు నిర్వహించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ పిలుపునిచ్చారు. గుంటూరులో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సమ్మె ముగించి ఇప్పటికీ నాలుగు వారాలు గడిచినా ఇంత వరకూ ప్రభుత్వం సమ్మెకాలం జీతానికి సంబంధించిన ఉత్తర్వులు, ఇతర హామీలకు సంబంధించిన ఉత్తర్వులు ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. ఈనెల 22 నాటికి సమ్మె ముగించి నెల రోజులు అయిన సందర్భంగా అన్ని మండలాల్లో సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ జరిగే ప్రదర్శలనల్లో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో టి.పద్మావతి, సిహెచ్.ప్రమీల, గోవర్ధిని తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : అసంఘటిత రంగంలో పని చేస్తున్న ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని టిటి యార్డు ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి టిటి యార్డు ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరాల తరబడి పని చేస్తున్న కార్మికులు వయసు పైబడి పనులు చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం చేసే సమగ్ర చట్టం ఉపయోగపడుతుందని, ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 200 మందికి పైగా పని చేస్తున్న టిటి యార్డులో సరైన మంచినీటి సదుపాయం కల్పించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని విమర్శించారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వి.జలాట్, సాంబయ్య, మరియదాసు, సురేష్, ప్రవీణ్, గోపి, వెంకయ్య, గోపాలరావు, సుధీర్, గోవర్ధనరెడ్డి, శేషగిరి, పున్నారావు, శ్రీను, ఎ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ స్పందనకు ఆరు అర్జీలు

ప్రజాశక్తి-తెనాలి

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మొత్తం ఆరు అర్జీలు దాఖలైనట్లు ఏవో జయజయ రావు చెప్పారు. వారిలో రెవెన్యూ శాఖకు సంబందించి మూడు, మున్సిపాలిటీకి సంబందించి రెండు, పోలీసు శాఖకు సంబందించి ఒక అర్జీ దాఖలైనట్లు వెల్లడించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబందిత శాఖలకు పంపుతామన్నారు.

ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -మేడికొండూరు : మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్దగల ఎన్నారై ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారము మెగా రక్తదాన శివరము, అవయవ దానం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ కష్టపడి చదివితే 40 సంవత్సరాలు మంచి భవిష్యత్తు ప్రతి ఒక్కరికి దరి చేరుతుందని అన్నారు. విద్య, వైద్యం, సేద్యం కావాలని, మద్యం పోవాలని అన్నారు. మానవత వాలంటీర్ సర్వీస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి రమేష్ మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏవో సీతారామయ్య, మానవతా కన్వీనర్ సలీం మాలిక్, అనంతపురం జిల్లా ఇంటిలిజెంట్ డిఎస్పి గోలి లక్ష్మయ్య, మానవత డైరెక్టర్ యు సాంబశివరావు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఆర్ట్స్ స్కూలు ప్రారభం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమవారం ఈశ్వరీ లిబరల్ ఆర్ట్స్ స్కూల్ ప్రారంభమైంది. యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనారాయణన్ వర్సిటీ పాలకమండలి సభ్యులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి స్కూల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన సభలో విద్యార్థులు, ప్రొఫెసర్లను ఉద్దేశించి డాక్టర్ సత్యనారాయణన్ ప్రసంగించారు. తన తల్లి ఈశ్వరీ దేవి పేరున ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన లిబరల్ ఆర్ట్స్ స్కూల్ లో.అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధనను కొనసాగిస్తామన్నారు. బీఎస్సీ, బీఏ చదివే విద్యార్థుల కోసం వివిధ రకాల కోర్సులను ప్రవేశ పెట్టామనీ, సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ వంటి సబ్జెక్టుల్లో పీహెచ్ఏ ప్రోగ్రామ్స్ కూడా ప్రారంభిస్తున్నామన్నారు. వీటిని చదివేందుకు దూర ప్రాంతాలకు పరుగులు తీయకుండా ఆంధ్రాలోనే క్రమశిక్షణ గల విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు వెసులుబాటు కల్పించామన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్కుమార్ అరోరా యూనిర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ నికోలస్, డాక్టర్ జానికీ బాక్లే, ప్రశాంత్ మహాపాత్రో, డాక్టర్ గోపాల్ గురు, డాక్టర్ చందన్ గౌడ, డాక్టర్ ప్రదీఫ్ ఖోస్లా తదితరులు ప్రసంగించారు.

90 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాల్లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి టీడీపీ కార్యాలయం లో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 48వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 90 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఆకుల జయ సత్య, ఎం సుజాత పాల్గొన్నారు.

వృత్తిదారులకు కాట్రగడ్డ మధు వితరణ

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన పలువురు వృత్తిదారులకు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు తోపుడు బండ్లు రెండు, ప్లాట్ ఫామ్ రిక్షా ఒకటి, టిఫిన్ బండి ఒకటి, ఇస్త్రీ పెట్టె ఒకటి, మహిళలకు 12 మందికి కుట్టు మిషన్లను సోమవారం తెలుగుదేశం నాయకులతో కలసి ఆయన అందజేశారు. అదేవిధంగా మెస్సియా మిరాకిల్ చర్చి కాంపౌండ్ వాల్ కు బోర్వెల్ నిర్మాణం కొరకు రూ. 75 వేలు, మరో 8 కుటుంబాలకు రూ.5వేలు చొప్పున రూ.40వేలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఈపూరి బాబు, తెలుగు మహిళ తాడేపల్లి మండల అధ్యక్షురాలు బి.కృష్ణవందన, బెజ్జం రామకష్ణారావు, గుంపెన నాగేశ్వరరావు, షేక్ నాగూర్ వలి, వడ్డేశ్వరం, రాధా రంగా నగర్ మహిళలు పాల్గొన్నారు.

మానవ మెదడుపై విస్తృత పరిశోధనలు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్ :కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ వడ్డేశ్వరం పారిస్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్, ఫ్రాన్స్‌లోని సోర్బోన్ యూనివర్శిటీలు కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇండియా-పారిస్ జాయింట్ సదస్సును సోమవారం స్థానిక వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ప్రాంగణంలో ఘనం ప్రారంభించారు. ఎక్స్ ప్లెయిన్బుల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ ఫర్ అండర్‌స్టాండింగ్ హ్యూమన్ బ్రెయిన్ మరియు రిలేటెడ్ డిజార్డర్స్' అనే పేరుతో నిర్వహించిన ఈ సదస్సుకు కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ అధ్యక్షులు శ్రీ కోనేరు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ కెఎస్.జగన్నాధరావు కన్వీనర్ గా వ్యవహిరంచి ఫ్రాన్స్ లోని పారిస్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ డేనియల్ రాకోసియాను, ఫ్రాన్స్ లోని సోర్బోన్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ అలెగ్జాండర్ ఎస్కార్గ్యుల్ ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరు కాగా ఐఐటీ-ముంబై డైరెక్టర్ డాక్టర్ సుభాసిస్ చౌధురి, బెంగళూరులోని నిమ్ హాన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమ మూర్తి లు గౌరవ అతిథులుగా హాజరయి ప్రసంగించారు. ఐఐటీ-ముంబై డైరెక్టర్ డాక్టర్ సుభాసిస్ చౌధురి మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్ యొక్క పరిణామం మరియు న్యూరోడెజెనరేటివ్ డిజార్డర్స్ నిర్ధారణ మరియు చికిత్సలో దాని పాత్ర గురించి ప్రసంగించారు.

కెఎల్‌యులో ఘనంగా కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ క్రీడలు

ప్రజా శక్తి, తాడేపల్లి రూరల్ :కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ- 2024 క్రీడలను సోమవారం నాడు కెఎల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మాజీ భారత కబడ్డీ జట్టు క్రీడా కారుడు, విజయవాడ రైల్వే ఉద్యోగుల సంక్షేమ అధికారి అర్జునరావు నక్కల ముఖ్య అతిథిగా హాజరయి క్రీడలను లాంచనంగా ప్రారంభిం చారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కోనేరు లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ ని 2012 వ సంవత్సరం నుండి ప్రతీ ఏటా జరుపుతున్నామన్నారు. ఈ ఏడాది ఈ నెల 19 నుండి 21 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడలకు ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళల వంటి ఐదు రాష్ట్రాల నుండి సుమారు 480 మంది క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొంటున్నారని అన్నారు. తొలిరోజు బ్యాడ్మింటన్ సింగిల్స్ స్త్రీ, పురుషులు, బ్యాడ్మింటన్ సింగిల్స్ మహిళలు, ఖో-ఖో, బాస్కెట్ బాల్ తదితర క్రీడలు ప్రారంభమయ్యాయి. అయితే ఇంకా కబడ్డీ, పురుషులు, ఖో-ఖో మహిళలు, హ్యాండ్‌బాల్, చదరంగం పురుషులు మరు మహిళలు, బ్యాడ్మింటన్ సింగిల్స్ పురుషులు పలు రకాల క్రీడలు మంగళవారం, బుదవారం నాడు జరుగుతాయని క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కే హరి కిషోర్ తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరయిన అర్జునరావు నక్కల ను ఘనంగా సత్కరించారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మధుమోహన కృష్ణ

ఫిన్వేస్కో క్యాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్

నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి తెనాలి

స్థానిక గంగానమ్మపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిన్వేస్కో క్యాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాన్ని సోమవారం హ్యాపీ రిసార్ట్స్ అండ్ రిక్రియేషన్స్ డైరెక్టర్ అంబటి మధుమోహన్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫిన్వేస్కో హోల్డింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ జక్కంపూడి రవీంద్ర మాట్లాడుతూ సంస్థ రిజిస్టర్ ఆఫీస్ హైదరాబాద్‌లో, కార్పొరేట్ ఆఫీస్ విజయవాడలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫిన్వేస్కో క్యాపిటల్స్ లో ఎన్సీడీలను జారీ చేయాలంటే డిపాజిట్లకు మార్చి 4వ తేదీ వరకే అవకాశం ఉందని చెప్పారు. ఎన్సీడీల ద్వారా పెట్టుబడులు పెట్టినవారికి 9 నుంచి 12శాతం వరకు లభించే వడ్డీన నెలవారీ పొందే అవకాశం ఉందన్నారు. సంస్థలో లభ్యమయ్యే వివిధ రకాల సేవలను వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ ఎజిఎం నీలం సాంబశివరావు, వ్యాపారవేత్తలు టి వెంకటేశ్వర గుప్తా, సిహెచ్ యుగంధర్, కె సాంబశివరాజు, ఫిన్వేస్కో క్యాపిటల్ డైరెక్టర్ రాకేష్ ఆలమంద, కావూరి రామారావు, ఎం చంద్రశేఖర రావు, కే నాగరాజు, సయ్యద్ రియాజ్ ,ప్రకాష్ రావు, సాంబశివరావు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలోత్సవంలో నారాకోడూరు జెడ్‌పి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చేబ్రోలు

జిల్లా స్థాయి బాలోత్సవం గుంటూరు హిందూ కాలేజీలో 17, 18 తేదీలలో నిర్వహించిన వివిధ పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపరిచారని జడ్ పి హెచ్ ఎస్ నారాకోడూరు ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు సోమవారం తెలిపారు. ఎ శ్రీనివాసరావు మాస్టారు దర్శకత్వంలో ప్రదర్శించిన నమ్మినబంటు హాస్య నాటిక తృతీయ స్థానం, డ్రాయింగ్ లో ఎస్.కె నజ్మా తృతీయ స్థానం, వ్యాసరచనలో ఎస్ ఎల్ నాగ తులసి తృతీయ, స్పెల్లింగ్ బీ పోటీలో చిత్రలేఖ ప్రతిభ చూపారని తెలిపారు. 9 తరగతి విద్యార్థులు జానపద నృత్యంలో ఉత్తమ ప్రదర్శన ద్వారా ప్రసంసాలు పొందారని తెలిపారు. ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు విద్యార్థులకు ప్రశంస పత్రాలు మెమోంటోను అందచేశారు అన్నారు. పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులును విద్యార్థుల ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ శ్రీనివాస రావు, కోటి పద్మ, ఎన్ సరోజ , పి రాజ్యలక్ష్మి జగదీష్ డ్రాయింగ్ మాస్టర్ కె ప్రసాద్ పాల్గొన్నారు.

ఉసా సేవలు శ్లాఘనీయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :ఉద్యమాల ఉపాధ్యాయులు ఉసా ఆశయాలను కొనసాగించాలని ఘన నివాళులు నాయీబ్రాహ్మణ జేఏసీ బీసీ ప్రజాసంఘాలు నాయకులు పేర్కొన్నారు. బడుగు వర్గాల స్ఫూర్తి ప్రదాత ఉప్పుమావులూరి సాంబశివరావు (ఉసా) 72వ జయంతి సందర్భంగా స్థానిక గుంటూరు అంబేద్కర్ భవన్ ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసిరాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు అధ్యక్షతన జయంతి కార్యక్రమం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ ఉ.సాంబశివరావు గొప్ప సామాజిక ఉద్యమకారులని బహుజనులకు రాజ్యాధికార దిశగా యన లేని కృషిచేశారన్నారు. సీనియర్ హైకోర్టు న్యాయవాది సామాజిక న్యాయ కేంద్రం కన్వీనర్ వై కోటేశ్వరరావు ,నాయి బ్రాహ్మణ సేవా సంఘం సీనియర్ నాయకులు ఉప్పు మావులూరి సుబ్బారావు రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు భీమ్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నలపు నీలాంబరం బహుజన బీసీ మహాజన సమితి రాష్ట్ర అధ్యక్షులు సాంబశివరావు ఉద్యమ వేదిక రాష్ట్ర నాయకులు గంటా ప్రభుదాసు ఆర్.పి.ఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విప్పర్ల ముత్తయ్య విసికె పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె జయసుధ సమాచార హక్కుల చట్టం నాయకురాలు ప్రశాంతి పూలే అంబేద్కర్ పెరియార్ జాషువా ఫౌండేషన్ ఆర్గనైజర్ బత్తుల విల్సన్ బీసీ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు పివి రమణయ్య బీసీ కళామండలి అధ్యక్షులు కొల్లూరు నాగేశ్వరరావు నాయి బ్రాహ్మణ సౌందర్య సంక్షేమ సంఘం గుంటూరు అర్బన్ కన్వీనర్ భక్తేశ్వరరావు కో కన్వీనర్ శివ, రవీంద్ర నాయీబ్రాహ్మణ జేఏసీ గుంటూరు అర్బన్ కమిటీ కన్వీనర్ టి హరినాథ్ బాబు నాయీబ్రాహ్మణ హాస్టల్ మాజీ సెక్రెటరీ నిడుముక్కల రాంబాబు తదితరులు ప్రసంగిం చారు.

'అనుయాయులకు దోచిపెడుతున్న పిన్నెల్లి సోదరులు'

ప్రజాశక్తి - మాచర్ల

ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలన్న పథకం పిన్నెల్లి సోదరులకు బాగా కలిసి వచ్చిందని పట్టణంలో విలువైన స్థలాలను వారి అనుచరులకు దోచి పెట్టేందుకు వరుస కుదిరిందని మాచర్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక పిడబ్ల్యుడి కాలనీలో పేదల పేరుతో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడి అనుచరులు నిర్మించుకుంటున్న అంతస్తుల భవన సముదాయాలను పార్టీ నాయకులతో కలిసి బ్రహ్మారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కట్టే సమయంలో వర్క్ షాప్ ఏర్పాటు చేసేందుకు కాలవల నిర్వహణ అధికారులు నివాసం ఉండేందుకు ఈ స్థలాన్ని ప్రభుత్వం సేకరించిందన్నారు. అనంతర పరిణామక్రమంలో వర్క్ షాపు మూతపడటం, అధికారుల సంఖ్య తగ్గిందని,ఈ ఇళ్లలో రిటైర్ అయిన అధికారులు చిన్న ఉద్యోగులు నివాసం ఉంటూ వస్తున్నారని తెలిపారు. ఇక్కడ ఉన్న విలువైన ఖాళీ స్త లాలపై ఎమ్మెల్యే ఆయన సోదరుడి కన్ను పడిందన్నారు .ఈ స్థలాలను అప్పనంగా వారి అనుచరులకు బంధుమిత్రులకు అప్పగించారని , స్థాయిని బట్టి,ఒక్కొక్కరు మూడు సెంట్లు, రెండు సెంట్లు తీసుకొని బహుళ అంతస్తుల భవనాలు నిర్మించుకుంటున్నారని వాటికి మళ్లీ హౌసింగ్ అధికారుల ద్వారా హౌసింగ్ స్కీం ద్వారా లబ్ధి కూడా పొందుతున్నారని తెలిపారు.అధికారులు అక్రమ నిర్మాణదారులకు లబ్ధి చేకూరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు . దశాబ్దాలుగా పిడబ్ల్యూ కాలనీలో నివాసం ఉంటున్న పేదలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు న్యాయం జరిగేలా చూస్తానని బ్రహ్మారెడ్డి అక్కడి వారికి హామీ ఇచ్చారు.

భద్రత,రక్షణ లేని భూ హక్కుల చట్టం

ప్రజాశక్తి-సత్తెనపల్లిరూరల్

ప్రజల ఆస్తులకు భద్రత రక్షణ లేని ఎపి భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారూరి లింగారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక ఎపి భూహక్కుల చట్టం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సత్తెనపల్లి తాలూకా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 11వ రోజుకు చేరాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి సీనియర్ న్యాయవాది చిట్టా విజయ భాస్కరరెడ్డిలు నిరాహారదీక్షలను ప్రారంభించారు. న్యాయవాది టి.హరినాథ్,న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడు ఎం.నరసింహారావు, వెంకట్రావు, పాలేటి నాగేంద్ర, ఎ. సామ్యూల్, గంగారావు, గంగారావు, శ్రీకాంత్ నిరహరదీక్షల్లో పాల్గొన్నారు. న్యాయవాదులు ఎన్. వేణు గోపాల్, కె.వీర భాస్కర్ రెడ్డి, సిహెచ్ చిన సత్యనారాయణ , పాపారావు, పి.వెంకటశివ సందర్శించి సంఘీభావం తెలిపారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని నాగార్జుననగర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 394 వ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు.

'జగనన్నకు చెబుదాం'లో అదనపు ఎస్పీకి

స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ ఆర్.రాఘవేంద్ర

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జగనన్నకు చెబుదాం ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని అదనపు ఎస్పీ ఆర్. రాఘవేంద్ర పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుండి కుటుంబ,ఆర్థిక, ఆస్థి తగాదాలు మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందాయన్నారు.

అప్పు తీర్చినా పొలం కాజేసే యత్నం

తెలియకుండానే కుమారుడు చేసిన అప్పుకు సంబంధించి బాకీ మొత్తం చెల్లించినప్పటికీ తన పేరిట ఉన్న 1.90 సెంట్ల పొలం కాజేయాలన్న ఉద్దేశ్యంతో సమీప బంధువులు వైసిపి నాయకులు కిలారి గోపాల్ రావు, మోహన్ కుమార్, చైతన్య కుమార్ సురేష్ కుమార్ లు ఇబ్బందులు పెడుతున్నారని క్రోసూరు మండలం చాలమర్తికి చెందిన అల్లడి కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. క్రోసూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, తనకు న్యాయం చేయాలని కోరారు.

స్థలం ఆక్రమించి అక్రమకట్టడం

పిడుగురాళ్ల మండలం జానపాడుకి చెందిన గురజాల అల్లిబుడే తాను స్థలం కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నానని, పక్క స్థలం వ్యక్తులు తన స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడం చేపట్టారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రశ్నిస్తే దాడి చేస్తున్నారని తనకు న్యాయం చేయాలని కోరారు.

మాది ప్రేమ పెళ్లి.. రక్షణ కల్పించండి

తాము మేజర్లమని, కొన్నేళ్ల నుండి ప్రేమించుకున్నామని, 3 నెలల క్రితం పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నామని ఈ నేపథ్యంలో యువతి తల్లి దండ్రుల నుండి ప్రాణ హాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని గురజాల మండలం జంగమహేశ్వరపురానికి చెందిన రాజశేఖర్, ప్రీతి వినతిపత్రం అందజేశారు.

ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వట్లేదు

రెండు నెలల క్రితం తన ద్విచక్ర వాహనం అపహరణకు గురైందని, చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వడం లేదని యడ్లపాడు మండలం సందెపూడికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు తుర్లపాటి సన్నీ ఫిర్యాదు చేశారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకోవాలని,కేసు నమోదు చేయించి ఎఫ్ఐఆర్ కాపీ ఇప్పించాలని కోరారు.

కొత్త మీటర్ కోసం ఎఫ్ఐఆర్ కాపీ

ఇంటికి బిగించిన మీటర్లు దొంగలు అపహరించారని కొత్త మీటర్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులు సంప్రదించగా పాతమీటర్ పోయినట్లు కేసు పెట్టినట్లు ఎఫ్ఐఆర్ కాపీ ఇస్తేనే కొత్త మీటర్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారని, దాచేపల్లి మండలం గామాల పాడుకి చెందిన పసుపులేటి నారాయణ ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులను కేసు నమోదు నమోదు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదని, రెండు నెలల నుండి చీకటిలో మగ్గుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

కొన్ని నెలలుగా జీతమివ్వట్లేదు

వీసా కన్సల్టెన్సీ ఆఫీసులో జాబ్ చేసున్న తనకు కొన్ని నెలలుగా జీతం ఇవ్వడం లేదని చిలకలూరిపేటలోని పండరీ పురానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు. జీతం ఇవ్వకుండా పని చేయించుకుంటున్నారని, అడిగితే ఇబ్బంది పెడుతున్నారని తనకు న్యాయం చేయాలని కోరారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

తనకు చెందిన 66 గజాల స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి అక్రమ నిర్మాణం చేపడుతున్న షేక్ మాబి, షేక్ మస్తాన్ బి, కనపర్తి సుబ్బారావులపై చర్యలు తీసుకోవాలని నరసరావుపేట పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన కొడిమెల రాజేష్ ఫిర్యాదు చేశారు దీనిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆడపిల్ల పుట్టిందని వేధింపులు

తనకు ఆడపిల్ల పుట్టిందని భర్త,అత్త మామలు వేధిస్తున్నారని,అదనపు కట్నం కోసం శారీరకంగా మానసికంగా హింసిస్తూ ఇబ్బంది పెడుతున్నారని రెండేళ్ల క్రితం వివాహమైన అమరావతి మండలం లేమల్లెకి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.న్యాయం చేయాలని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

రూ.2 కోట్లతో నిర్మించనున్న కళ్యాణ మండపానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పెదకూరపాడు

శంకుస్థాపనలో పాల్గొన్న అయోధ్య రామిరెడ్డి, నంబూరు శంకరరావు

నియోజకవర్గంలో కళ్యాణ మండపాలు వంటి అభివృద్ధి పనులకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పెద్ద ఎత్తున సాయం అందుతోందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని 75 తాళ్లూరులో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి సోమవారం రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి టిటిడి కృషి చేస్తోందని, అమరావతి మండలం వైకుంఠపురంలో ఆలయ అభివృద్ధికి కొంత సాయం అందిస్తోందన్నారు. గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి శ్రీవాణి ట్రస్ట్ నిధులు అందుతున్నాయన్నారు. నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయడంలో తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో తాగునీటి కోసం జలజీవన్ మిషన ద్వారా సుమారు రూ.80 కోట్ల మేర నిధులు ఖర్చు చేస్తున్నా మన్నారు. ఇంత అభివృద్ధి చేస్తున్నా ప్రతిపక్షాలు విమర్శలు చేయడం తగదన్నారు. అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గ అభివద్ధికి తన వంతు సాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ సాంబిరెడ్డి, ఎంపిపి బి.మీరయ్య పాల్గొన్నారు.

ప్రజలు, రైతుల సమస్యలు తీర్చడమే లక్ష్యం

విద్యుత్ శాఖ అధికారులు, నాయకులతో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దళితులు, రైతులు ,మధ్యతరగతి ప్రజల సమస్యలు పరిష్కరించడమే వైసిపి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. రూ 8 కోట్ల తో ఉప్పలపాడు గ్రామ సమీ పంలోని జగనన్న కాలనీ లో నూతనంగా నిర్మిం చిన 33/11 కె.వి విద్యుత్ ఉప కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో వసతి గృహ సముదాయానికి రూ 4 కోట్లతో, ఉప్పల పాడు గ్రామ సమీపంలో గల జగనన్న కాలనీలో ఉప విద్యుత్ కేంద్రాన్ని రూ 8 కోట్లతో నిర్మించామన్నారు. నియోజకవర్గంలో గతంలో 14 సబ్ స్టేషన్లు ఉండేవని ప్రస్తుతం నూతనంగా 6 సబ్ స్టేషన్లు మొత్తం 20 విద్యుత్ ఉపకేంద్రం ద్వారా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు.

ఈపూరు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈదర రాధిక అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను, జరుగుతున్న పనులను వివరించారు.

లబ్ధిదారులకు వాహనాలు పంపిణీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం కలెక్టర్ శివ శంకర్ లోతేటి, అధికారుల చేతుల మీదుగా 6 రకాల వాహనాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గతంలో జరిగిన 'నవోదయం'కు ధరఖాస్తు చేసుకున్న ఆరుగురు లబ్ధిదారులకు జగనన్న బడుగు వికాసం కింద మంజూరైన 6 రకాల వాహనాలను అందజేశారు.

పేదలకు వస్త్ర దానం

ప్రజాశక్తి - మాచర్ల : వీరమాచనేని సుభాష్ చంద్రబోస్ ఐదవ వర్ధంతి సందర్భంగా అతని కుటుంబ సభ్యులు తుమ్మల సత్యప్రసాద్ పేదలకు నూతన వస్త్రాలను దానం, .అన్నదానం చేశారు. స్వామి వివేకానంద స్టూడెంట్ హోమ్ కు ఇన్వర్టర్ బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా రొటేరి యన్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ ఈ ప్రాంతంలో అందరికీ సుపరిచితమైన వ్యక్తి అని, రొటేరియన్‌గా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసేవారని అన్నారు. ఆయన జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఫౌండేషన్‌కు విరాళంగా రూ.3 లక్షలు సేవా కార్యక్రమాలు నిర్వ హిం చేందుకు అందించినట్లు తెలిపారు. నిరుపేద మహిళల కు చీరలు, పురు షులకు పంచెలు,టవళ్లు ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో రొటేరియన్లు డాక్టర్ రామకోటయ్య, పటాన్ నాగూర్ వలి, కోనేరు శంకరరావు, లగడపాటి వెంకటేశ్వర్లు ,డాక్టర్ గోనుగుంట్ల శ్రీకాంత్ ,చెరుకూరు నరసింహారావు ,కర్నాటి వాసు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం రైతుల ఎదురు చూపులు

నెలరోజులు గడుస్తున్నా పరిష్కారం కాని సమస్య - ఆందోళనలో దుగ్గిరాల కోల్ట్ స్టోరేజీ అగ్ని ప్రమాద భాధితులు

ప్రజాశక్తి దుగ్గిరాల

గత నెల 19వ తేదీన స్థానిక శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగి సోమవారం నాటికి నెల రోజులు అయినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో అగ్ని ఆరలేదు. రైతులకు అందాల్సిన పరిహారం అందలేదు. అగ్నిమాపక దళానికి చెందిన అత్యంత అధునాతనమైన యంత్రాలతో పాటు 8 అగ్నిమాపక శకటాలు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దాదాపు 50 మీటర్ల ఎత్తున ఉన్న కోల్డ్ స్టోరేజీ లోపలి భాగం ఆర్పటం తలకు మించిన భారమైనది . కోల్డ్ స్టోరేజ్ గోడలు కూలుతాయేమోనని ఇప్పటికే భయపడు తున్నారు. దీనితో గోడలు పగలగొట్టే ప్రయత్నం చేయలేదు ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది యజమానితో పాటు 11 మంది గాయపడ్డారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపించుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సంఘటనను విచారించే నిమిత్తం ప్రభుత్వం వివిధ శాఖలకు చెందిన 11 మంది అధికారులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసి ఉన్నది ఈ కమిటీ కోల్డ్ స్టోరేజీ రికార్డులు స్వాధీనం చేసుకొని భద్రపరిచారు .యాజమాన్యం బీమా చేసిన న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ సర్వే పనులు మరో ఏజెన్సీకి అప్పగించి ఉన్నది విచారణ ఇంకా పూర్తి కాలేదు. రైతుల స్టాక్ పెట్టినప్పుడు ధరలు తక్కువగా ఉన్నాయి. సోమవారం క్వింట పసుపు ధర స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో సగటున రూ.11700 పలికినది. స్టాక్ పెట్టినప్పుడు ఉన్న ధరల ప్రకారం బీమా చేసిన మొత్తం రూ.40 కోట్లు అని కోల్డ్ స్టోరేజ్ యజమాని తెలిపారు. బీమా క్లైమ్ పూర్తిగా వచ్చినప్పటికీ దాదాపు రూ. 45 కోట్ల ప్రస్తుత ధరల

ఫైల్ ఫోటో

ప్రకారం చాలా తక్కువ. విచారణ పూర్తి అవ్వడానికి ఇంకా ఎంత కాలం పడుతుందో తెలియని పరిస్థితి. మరోపక్క ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో అధికార యంత్రాంగం బిజీ బిజీగా ఉన్నది. దీనితో విచారణ ఇప్పటికీ పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు మరొక పక్కా రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని పసుపు రైతులు కోరుతున్నారు.

ఆయుర్వేద వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

వైద్యాధికారి డాక్టర్ సిహెచ్‌విఎస్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

దీర్ఘకాలిక వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులకు 50 రకాల మందులను ప్రభుత్వం సరఫరా చేసిందని వల్లభరావు పాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల అధికారి డాక్టర్ సిహెచ్ విఎస్ కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. గతంలో మునుపెన్నడు లేనివిధంగా ప్రభుత్వం ప్రాణాంతక వ్యాధులకు మందులు రోగులకు అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. పైల్స్ , మూత్రశయ, జీర్ణకోశ, గుండె, చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, మధుమేహం, రక్తపోటు, గ్యాస్ ట్రబుల్, మలబద్ధకం, రక్తహీనత, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు మందులు ఆయుర్వేద ఆసుపత్రికి తరపున చేసినట్లు ఆయన తెలిపారు. ల్లభరావు పాలెం పరిసర ప్రాంతాలలోని ప్రజలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ హై స్కూల్ పదవ తరగతి 98-99 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ ంలో ఉపాధ్యాయులను పూలమాల లతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లా డుతూ విద్యార్థులు స్థిరపడి గురువులను గుర్తుపెట్టుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు విద్యార్థి దశలో మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకు న్నారు. తదనంతరం కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహమ్మద్ హక్, కుమారి, గాలయ్య, శివరామకృష్ణ, లీలా కృష్ణ, శ్రీదేవి, నాగమణి, ఎస్పీ ప్రభాకర్, ప్రభాకర్పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలపాటి పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి నియోజకవర్గ పరిధిలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అందిస్తున్న పెళ్లికానుక ప్రజాదరణ పొందింది. ఈకార్యక్రమంలో భాగంగా తెనాలి పట్టణ 5వ వార్డుకు చెందిన పఠాన్ బాషాఖాన్, ఆరిఫా దంపతుల కుమార్తె షర్మిల వివాహం సందర్భంగా శనివారం ఆమెకు ఉంగరం అందజేశారు. స్థానిక టిడిపి కార్యకర్తలు వదువుకు చీర, సారె ను సంప్రదాయంగా అందించారు

సైనికుల కుటుంబాల సంక్షేమానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

మాజీ సైనికులు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవానుల కుటుంబాల సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలకు ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని కోస్టల్ బ్యాంక్ రూ. 1 లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు బ్యాంకు ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా విరాళం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బ్యాంకు ప్రతినిధుల్ని అభినందించారు. దేశ రక్షణకు అహర్నిశలు కషిచేసిన సైనికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబాలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంక్ క్లస్టర్ హెడ్ జె.హరిప్రసాద్, బ్రాంచి మేనేజర్ షేక్.గౌస్‌బాష, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఆర్.గుణషీలా తదితరులు పాల్గొన్నారు.

చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న కోస్టల్ బ్యాంకు ప్రతినిధులు

రీజనల్ కో-ఆర్డినేటర్‌గా డేవిడ్‌రాజు

ప్రజాశక్తి-తాడేపల్లి : గుంటూరు జిల్లా జెసిఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా తాడేపల్లి పట్టణానికి ఈదులమూడి డేవిడ్‌రాజు నియమితుల య్యారు. ఆ మేరకు సిఎం జగన్ పంపించిన ఉత్తర్వులను సోమవారం విలేకరులకు అందజేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ తనను జిల్లా రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమించడానికి కృషి చేసిన పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మేకా వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల నాయకులు రాజేష్, వెంకటేశ్వరరావు, సిహెచ్.దుర్గారావు, ఎం.ప్రకాష్, అనిల్, ఎస్.పార్వతి, కె.శ్రీను, బి.దాసు తదితరులు పాల్గొన్నారు.

డేవిడ్‌రాజున అభినందిస్తున్న నాయకులు

చిన్న వెంకటరెడ్డికి వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి తెనాలి



వై య ు స్సా ర్ నాటక కళాపరిషత్ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్యా చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట రామకష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న పోటీలలో తొలి ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి "ఇంద్రప్రస్థం" సాంఘిక నాటికను ప్రదర్శించారు. గోపి సత్యప్రకాష్ రచనకు ఎన్. రవీంద్రరెడ్డి దర్శకత్వం వహిం చారు. అలాగే పిట్టు వెంకట కోటేశ్వరరావు పర్యవేక్షణలో (ఎగ్జిబిషన్ ప్రదర్శనగా) అద్దేపల్లి - ఆరాధ్యుల ఆర్ట్స్, తెనాలి వారిచే "థాంక్స్ ఫర్ ద పీ.యమ్" నాటికను ప్రదర్శించారు. ఆకురాతి భాస్కర్ చంద్ర రచనకు అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని వైసిపి సీనియర్ నాయకులు గుదిబండి చిన్న వెంకటరెడ్డికి అందించి సత్కరించారు. కార్యక్రమ ంలో బొమ్మారెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎం సత్యనారాయణ శెట్టి, ఆరాధ్యుల కన్నా, జి సుబ్బారావు, లక్కరాజు లక్ష్మణ్ రావు, కొండపి శ్రీనివాసరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఉడుముల మహేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి రూరల్ :మహిళా పక్షపాతిగా అనేక సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఔదార్యానికి రాష్ట్రంలో పొదుపు సంఘాల మహిళలు నీరాజనాలు పలుకుతున్నారని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి యార్డు ఆవరణలో సోమవారం మాజీ మండలాధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన వైఎస్ఆర్ ఆసర 4వ విడత సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గున్నారు. తెనాలి గ్రామపరిధిలో మొత్తం 1474 డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు రూ 12.96 కోట్లు చెక్కును సోమవారం పంపిణి చేశారు. ఎమ్మెల్యే శివకుమార్ ప్రసంగిస్తూ నాలుగో విడత రూ. 6,394.83 కోట్లు మహిళల ఖాతాల్లో జమచేసి మహిళల ఆత్మగౌరవాన్ని పెంచారన్నారు. అలాగె తెనాలి రూరల్ ప్రాంతాల్లో ఆసర నాలుగు విడతల్లో సుమారు రూ. 51 కోట్లు డ్వాక్రా మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేశామన్నారు. గత ప్రభుత్వ హయాం లో చంద్రబాబు రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక పైసా కూడా మాఫీ చేయకుండా మోసం చేయడంతో మహిళలు డీలా పడిపోయారని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీల మేరకు అమలుచేసి చూపిస్తున్న ముఖ్యమంత్రికి మహిళలు వివిధ రూపాల్లో తమ కృతజ్ఞలు తెలియజేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంతటి అభివృద్ధి మన కళ్ళముందే కనబడుతుంటే ప్రతిపక్షాల కళ్ళకు అభివద్ధి, సంక్షేమం కానరాకపోవడం శోచనీయమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి లు జెడ్పిటిసి లు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బండారు ప్రసాద్

చేనేతలకు టిక్కెట్లు కేటాయించాలి

జాతీయ అధ్యక్షులు బండారు ప్రసాద్

ప్రజాశక్తి మంగళగిరి

రానున్న సాధారణ ఎన్నికల్లో చేనేత సామాజిక తరగతులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలలో, చేనేతలకు టికెట్ కేటాయించని పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని జాతీయ అధ్యక్షులు బండారు ప్రసాద్ అన్నారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అనుబంధ విభాగాల సమావేశం సోమవారం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు బండారు ప్రసాద్ మాట్లాడుతూ 70 వేలకు పైగా ఓట్లున్న శాసనసభ నియోకవర్గాలలో చేనేతలకు శాసనసభ స్థానాన్ని కేటాయించ కుండా, కేవలం 2 లేక 3 వేల ఓట్లు మాత్రమే వున్న ఇతర సామాజికవర్గాల వారికి కేటాయిస్తూన్నారని, చేనేతలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. రానున్న ఎన్నికల్లో చేనేతలు అత్యధికంగా ఉన్న చీరాల, మంగళగిరి, వెంకటగిరి, మదనపల్లి, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ధర్మవరం, పుట్టపర్తి, పెనుగొండ, ఏమ్మిగనూరు, రాజమండ్రి రూరల్, గాజువాక, విశాఖపట్నం (సౌత్) వంటి శాసనసభ నియోజక వర్గాలలో కనీసం 6 శాసనసభ స్థానాలనూ, హిందూపూర్, రాజమండ్రి, కర్నూల్ వంటి చేనేతలు అధికముగా ఉన్న పార్లమెంట్ నియోజకవర్గాలలో కనీసం 2 పార్లమెంట్ స్థానాలను చేనేత వర్గానికే కేటాయించాలని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలను డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు యనమాల శివరాం ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రాజారావు, జాతీయ కమిటీ సభ్యులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామనాథం పరమేశ్వర రావు, వాసాపల్లి రాజు, రాష్ట్ర వీవర్స్ గౌరవాధ్యక్షులు నాలి అప్పారావు,సురి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలతో నమ్మించలేరు : వైసిపి

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి నాయకులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులు ఎన్నికల సమయంలో చేనేతలకు మాయమాటలు చెప్పి నమ్మించలేరని రానున్న ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి టిడిపి తరఫున పోటీ చేసే నారా లోకేష్‌ను బీసీలు మరోసారి ఓడిస్తారని వైఎస్ఆర్సిపి మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ గంజి చిరంజీవి అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీలో పర్యటించారు. ఇటీవల నారా బ్రాహ్మణి చేనేత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేనేతలకు ఏమి చేయలేదని, అన్యాయం చేశారని అన్నారు. 2014 సంవత్సరం నుండి 2019 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న ఏమి చేయలేదని అన్నారు. ఎన్నికల సమయంలో సేవా కార్యక్రమాలు పేరుతో బీసీలను మాయ చేయడానికి మరల నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులు వస్తున్నారని విమర్శించారు.

గుర్తింపు ఉన్న చేనేతలకు పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి మంగళగిరి :చేనేత కార్మికులకు నూతన పెన్షన్లు మంజూరి, ప్రభుత్వ నూతన నిబంధనలను రద్దు చేయటం, సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మంగళగిరిలోని చేనేత జౌళి శాఖ కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నాయకులు అసిస్టెంట్ కమిషనర్‌కి వినతి పత్రాన్ని సమర్పిం చారు. అర్హులైన చేనేత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఉత్తర్వులు జారీ చేయడంతో తమకు జనవరి నెల నుంచి వృద్ధాప్య ఫంక్షన్ వస్తుందని సంతోషపడిన చేనేత కార్మికులకు ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నిబంధనల వలన నిరాశకు గురయ్యారన్నారు .రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికల నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కొత్తూరు మోహన్ రావు, కట్టా హేమసుందర్రావు, కడుపు కన్నయ్య, గొట్టుముక్కల బాలాజీ, జొన్నాదుల భారతి, గజవల్లి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు :తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ వర్క్సులో 42 ఎంఎల్‌డి ఫిల్టరేషన్ ప్లాంట్ వార్షిక మరమ్మతుల నిమిత్తం బుధవారం తాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు జిఎంసి ఎస్.ఈ.సుందరరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం నుండి గురువారం ఉదయం వరకూ స్థానిక బిఆర్ స్టేడియం, ఐపిడి కాలనీ, శ్రీనివాసరావుపేట, నల్లచెరువు, తారకరామా నగర్, ఆటోనగర్ ఏరియాలలో తాగునీటి సరఫరా పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున ప్రజలు సహకరించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ఎఎన్‌యు డ్యూయల్ డిగ్రీ ఇంజినీరింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ డ్యూయల్ డిగ్రీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత తెలిపారు. వర్సిటీలోని డాక్టర్ వైయస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ కోర్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేశామని ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా 10 ప్లస్ 2 చేసిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. బీటెక్ తో పాటు ఎంటెక్ కూడా కలిపి డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. సిఎస్‌సి, ఈసీఈ, ట్రిబుల్‌ఈ, డాటా సైన్స్, సివిల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, మెకానిక్ ఇంజనీరింగ్ వంటి కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు ఆర్కిటెక్చర్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. ఈ కోర్సులు సెల్ఫ్ సపోర్టు కేటగిరి ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని, వివారలకు పోన్‌నంబర్లలో సంప్రదించాలని 0863 2346138, 171, 9440258811, 9440258822 డాక్టర్ అనిత తెలిపారు.

వైద్యులకు అండగా ఉంటాం

డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభించిన మంత్రి రజిని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

రాష్ట్రంలో వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని భరోసా ఇచ్చారు. డాక్టర్స్ కమ్యూనిటీ పరంగా ఏ అవసరం వచ్చినా, సమస్య ఉత్పన్నమైన తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభింపజేశారు. స్థానిక అమరావతి రోడ్డులోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి విడుదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం రోగుల సేవలో ఉండే వైద్యులకు ఈ తరహా క్రీడలు మానసిక శారీరక దృఢత్వానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్రంలోనే అత్యధికంగా వివిధ రకాలైన ఆపరేషన్లు,వైద్య సేవలు గుంటూరు జిల్లాలోనే అత్యధికంగా జరుగుతాయని తెలిపారు. అనంతరం డిపిఎల్ లోగోని ఆవిష్కరించారు. మంత్రి రజిని ని వైద్యులు ఘనంగా సత్కరించారు. డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ లో పాల్గొంటున్న ఎనిమిది టీములతో మంత్రి రజినీతో విడివిడిగా ఫోటోలు దిగి సందడి చేశారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు కొండబోలు కష్ణ ప్రసాద్, ఆవుల శ్రీనివాస్,టి చంద్రశేఖర్ రెడ్డి, అన్వర్ హుస్సేన్, బాలినేని సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

అధికారుల నిర్లక్ష్యంతోనే డయేరియా : మన్నవ మోహనకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి :గుంటూరు నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం వల్లే డయేరియా కొనసాగుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాహం వేసి గొంతు తడుపుకోవడానికి నీరు తాగాల్సి వస్తే ఎక్కడ ఆస్పత్రుల్లో చేరాల్సి వస్తుందేమోనని భయపడుతున్నా రంటే నగరంలో పరిస్థితి ఎంత అధ్వాన్నస్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. రూ.వెయ్యికోట్లకు పైగా బడ్జెట్ ఉన్నా తాగు నీటి సరఫరా విషయంలో ఎక్కడ లోపాలున్నాయో ఇప్పటివరకు గుర్తించకపోవడం విచారకరమన్నారు. డయేరియా లక్షణాలతో నగరంలోని శ్రీనగర్‌కు చెందిన గాజుల సూర్యనారాయణ అనే వ్యక్తి మృతి చెందారని, ఈ మరణాలన్నింటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 200 మందికిపైగా ఆస్పత్రిపాలైతే వైసీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని, ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు రాజకీయాలకు అతీతంగా పాలకపక్షం వేగంగా స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. వైద్యశాఖ మంత్రి విడదల రజని అసలు సమస్య లేనట్లే మాట్లాడుతున్నారని, ఇటువంటి సమయంలోనైనా రాజకీయాలు పక్కనపెట్టి బాధితుల్ని ఆదుకోవాలన్నారు.

జనరిక్ మందులను ఉపయోగించండి

సిరిపురంలో జనరిక్ మెడికల్ షాపును ప్రారంభించిన మాజీ మంత్రి మేకతోటి సుచరిత

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని సిరిపురం గ్రామంలో సోమవారం గ్రామం ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ ప్రాంగణంలో జనరిక్ మెడికల్ షాపు ను మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ తక్కువ ధరలకు జనరిక్ మందులు ప్రజలకు అందుబాటులో లోకి రావడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు మండల ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, జడ్పిటిసి సభ్యులు కందుల సిద్దయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి : కలెక్టర్

కలెక్టర్ స్పందనకు 178 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, డిఆర్‌ఓ పెద్దిరోజా , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి , రవీంద్రరావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మీ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 178 అర్జీలను స్వీకరించారు. త్వరలో భారత ఎన్నికల కమిషన్ రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే అవకాశం వున్నందున జనవరి 22కు ముందు, ఆ తరువాత ఉన్న అన్ని క్లయిమ్‌లను నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, సిపిఓ శేషశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్.ఈ బ్రహ్మయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డయేరియా మృతులకు పరిహారం చెల్లించాలి

కలుషితనీరు తాగటం వల్ల గుంటూరు నగరంలో డయేరియాతో ఐదుగురి మృతికి కారకులైన జిఎంసి అధికారులపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించాలని కోరుతూ టిడిపి గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మహ్మద్ నసీర్ స్పందనలో అర్జీ అందచేశారు. కలుషిత నీరు తాగి ఓబులు, పద్మావతి, మొహ్మద్ ఇక్బాల్, గాజుల సూర్యనారాయణ, మల్లెంపాటి శంకర్ మృతి చెందారన్నారు. వీరి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించి, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. నగరంలో 229 కేసులు నమోదు కాగా 183 మంది డిశ్చార్జ్ అయ్యారని, 46 మంది ఇంకా చికిత్స పొందుతున్నారన్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఇవి కాగా ప్రైవేటు ఆసుపత్రులలో అనేక మంది చికిత్స పొందుతున్నారని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రజలు చనిపోయారని ఆరోపించారు. ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించాలని కోరారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో పోరాటం చేస్తున్న రైతుల సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్పందనలో అర్జీ అందచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బేషరతుగా వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులకు అను గుణంగా అన్ని పంటలకూ మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వం చట్టం చేయాలని, రైతులకు సాగురుణాలు పూర్తిగా మాఫీ చేయాలని 2013 భూసేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, లఖింపూరి ఖేరీ ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, డబ్ల్యూటిఒతో చేసుకున్న ఒప్పందాలను నిషేధించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పందనలో అందించారు. అర్జీ ఇచ్చిన వారిలో నాయకులు షేక్.బాజీ షేక్.సలీం తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల్ని స్వాధీనం చేసుకోవాలి

వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ బోర్డు వైస్‌ప్రెసిడెంట్ షేక్.మస్తాన్, జాయింట్ సెక్రెటరీ షేక్.సుభానీ, సభ్యుడు సయ్యద్ సుభానీ స్పందనలో అర్జీ అందచేశారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, గనికపూడిలో వక్ఫ్‌బోర్డు భూమి 198 ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను లీజుకు తీసుకొని డబ్బులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేసి స్వాధీనం చేసుకొని, వక్ఫ్‌బోర్డు ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా గెజిట్ చేయాలని, ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు.

జిఎంసి స్పందనకు 36 ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు :స్పందనకు అందే ఫిర్యాదులు, ఆర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం జరిగేలా విభాగాధిపతులు, నోడల్ అధికారులు చొరవ చూపాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్ స్పందన నిర్వహించారు. ఈ స్పందనలో 36 ఫిర్యాదులు అందాయి.వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 10, ఇంజినీరింగ్ విభాగం 14, ప్రజారోగ్య విభాగం 3, ఉపా సెల్ విభాగం 7, అకౌంట్స్ విభాగం 2 ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులు ఉన్నాయి. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఎస్‌ఈ (ఎఫ్‌ఎసి) సుందర్రామిరెడ్డి, సిఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, ఎంహెచ్ఓ(ఎఫ్ఏసి) మధుసూదన్, ఉపాసెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు :సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలోని వివిధ మండలాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులకు వినతిపత్రాలు అందజేశారు. చేబ్రోలు, మేడికొండూరు, ప్రత్తిపాడు, పెదకాకాని, తుళ్లూరు, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో ప్రాతినిధ్యాలు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ మాట్లాడుతూ ఇప్పటికే కరోనా వల్ల, ఇతర కారణాలతో చనిపోయిన సిపిఎస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అందుతున్న పెన్షన్ వందలలోనే ఉందనే విషయాన్ని పార్టీల నాయకులకు వివరించారు. సిపిఎస్ వల్ల ఉద్యోగులకు ఒరింగిందేమీ లేదన్నారు. పాత పెన్షన్ వల్ల బతుకు భారం కాకుండా మలిదశలో జీవితానికి భద్రత ఉంటుందన్నారు. కావున అన్ని రాజకీయ పార్టీలు ఓపిఎస్ అమలుకు సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి-కొల్లిపర :సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్‌ను ను అమలుచేస్తామనే హామీని వైసిపి, టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని వైసిపి కొల్లిపర మండల అధ్యక్షులు అవుతు పోతురెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు భీమవరపు చిన్న కోటిరెడ్డికి సోమవారం యుటిఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి కుర్రా కేదార్ నాథ్, నాయకులు రామకృష్ణ ప్రసాద్, శివశంకర్, కాలేషావలి, రాము పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

ప్రజాశక్తి-గుంటూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కోరారు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో సిపిఎస్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ మేనిఫెస్టోను మత గ్రంధాలతో సమానంగా భావించిన జగన్మోహన్‌రెడ్డి, మేనిఫెస్టోలోని హామీలను ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు.ఉత్తరాఖండ్, సిక్కిం, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో సిపిఎస్ రద్దుచేసి, ఓపిఎస్ ప్రవేశపెట్టారని, కావున ఇప్పటికైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పద్మావతి, సభ్యులు హేమలత, సుమిత్రా దేవి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరీముల్లా షాఖాదరి, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఓపిఎస్ సాధన సమితి జిల్లా డిప్యూటీ కోఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.